క్లుప్తంగా

26న ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష



ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక : ఈ నెల 26న మునగపాక హైస్కూల్లో నిర్వహించనున్న ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం శ్రీనివాసరావు కోరారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఉదయం 8 గంటలకు నమూనా పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి కల విద్యార్థులు తమ పేర్లను ఈ నెల 22 లోగా నమోదు చేసుకోవాలన్నారు. సంస్థ సభ్యులు ఎం.సత్యనారాయణమూర్తి, కరణం నాయుడు, జనార్దన్, భూదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఎంపీ డాక్టర్ సత్యవతి పర్యటన

మునగపాక : మండలంలోని నాగవరం, గణపర్తి గ్రామాల్లో మంగళవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎంపీ నిధులతో నిర్మించిన రహదారులను వారు ప్రారంభిస్తారన్నారు. నాగవరంలో ఉదయం 10 గంటలకు, గణపర్తిలో ఉదయం 10.45 గంటలకు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరారు.

వరికి ఊపిరి పోసిన వర్షం



నారాయణపురం సమీపంలో వరిపైరు

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. చాలా రోజులుగా వర్షం పడలేదు. ఈ వర్షం ఎండిపోతున్న వరిపైరుకు ప్రాణం పోసిందని రైతులు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా మెరక ప్రాంతాల్లో వరినాట్లు ఎండిపోతున్నాయి. మరోపక్క శారద నదిలోనూ నీరు తక్కువగా ప్రవహిస్తుంది. దీంతో పలు సాగునీటి కాలువల్లో నీటి ప్రవాహం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం ఊరటనిచ్చింది.

వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం..



పాతరోడ్డు వంతెనపై కూలిన రక్షణ గోడ

కోటవురట్ల : పాతరోడ్డు వంతెనపై రక్షణ గోడ కూలిపోవడంతో ప్రమాదం పొంచి చూస్తోంది. ఈ వంతెన మీదుగా వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. నిత్యం, విద్యార్థులు, రైతులు వెళుతుంటారు. చౌడువాడ వెళ్లే రహదారి వైపు వంతెనపై ఉన్న రక్షణ గోడ చాలా వరకు కూలిపోయింది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా నదిలో పడి మృత్యువాత పడడం ఖాయం. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

చిన్నారులకు పోషకాహారం పంపిణీ



చిన్నారులకు అంగన్‌వాడీ సరకులు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ఎస్.రాయవరం : చిన్నారులకు విధిగా పోషకాహారం అందించాలని వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు అన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నెలవారి పంపిణీ సరకులు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం సమకూరుస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్య, వైద్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాలం సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొంతిన సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నదే

- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్
- ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంబరాలు



ప్రజా సంకల్పయాత్ర కేక్‌ను కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ప్రజా సంకల్పయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఎన్నికల హామీల అమలు ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంకల్పయాత్ర చేపట్టి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మునగపాకలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సువర్ణయుగంగా నడుస్తుందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పేరు గాంచారన్నారు. అలాగే ఆయన ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి రెండుకళ్లలా అందరికీ దర్శనమిస్తున్నాయన్నారు. ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకున్న సమస్యలు నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఉత్సవకమిటీ చైర్మన్ వేగి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు. మార్కెట్‌కమిటీ చైర్ పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు,పాలసంఘ అధ్యక్షులు మళ్ల సంజీవరావు, వార్డు సభ్యులు పెంటకోట సత్యనారాయణ (నానబ్బాయి), బొడ్డేడ సోమరాజు, పీలా శివ, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ పాల్గొన్నారు.



నక్కపల్లిలో కేక్ కట్ చేస్తున్న వీసం రామకృష్ణ

పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీ అధినేత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నక్కపల్లిలో పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ముందుగా దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేత హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా 2848 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన ఏకైక నేత జగనన్న అన్నారు. పాదయాత్ర సందర్భంగా తాను గుర్తించిన తెలుసుకున్న సమస్యల పరిష్కారానికి అధికారంలోకి రాగానే చర్యలు తీసుకున్నారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి 50 పడకల స్థాయికి పెంపు పాయకరావుపేట, ఎస్.రాయవరం పీహెచ్‌సీలకు నూతన భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు నెరవేర్చారన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో సుమారు 500 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉప సర్పంచ్ వీసం రాజు, ఎంపీటీసీ గొర్ల గోవిందు, మనబాల తాతారావు పాల్గొన్నారు

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం

- ఎంపీపీ బోదెపు గోవింద్
- రూ.9.70 లక్షలతో రేగుపాలెం పీహెచ్‌సీలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



రేగుపాలెం పీహెచ్‌సీలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ నేతలు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మండలంలోని రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సాయంత్రం నాడు నేడు పథకం కింద రూ.9.70 లక్షలతో చేపట్టబోయే 6 పడకల అదనపు గదుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి రూ.లక్షల కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇదంతా పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసమేనన్నారు. ఈ గదుల నిర్మాణం పూర్తయితే రేగుపాలెం ఆస్పత్రికి వచ్చే రోగుల కష్టాలు తీరుతాయన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలను ప్రభుత్వం మెరుగుపరుస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం.శిరీష, ఏపీఈడబ్ల్యూడీసీ డీఈ ప్రసాద్, ఏఈ సాయి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండకర్ల రెగ్యులేటర్ గేట్లకు మరమ్మతులు



కొండకర్ల రెగ్యులేటర్ వద్ద రైతులు

మునగపాక (అచ్యుతాపురం): అచ్యుతాపురం మండల పరిధిలోని హరిపాలెం-అందలాపల్లి వద్ద రెగ్యులేటర్ గేట్లు మరమ్మతు చేపట్టడంతో సాగునీటి సమస్య పరిష్కారం అయింది. కొండకర్ల ఆవ సిస్టమ్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా జగ్గన్నపేట, ఉప్పవరం, ఆనందపురం, పురుషోత్తపురం, కాశీపాలెం, కుమారపురం తదితర ప్రాంతాల రైతులు పంటల సాగు చేపడుతుంటారు. 800 ఎకరాలకు 1500 మంది రైతులు ఈ రెగ్యులేటర్‌పై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. అయితే రెగ్యులేటర్ వద్ద గేట్లు పాడైపోవడంతో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించడం లేదు. దీంతో సమస్యను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి దృష్టికి రైతులు తీసుకువచ్చారు. వారి కృషితో ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పనులు పూర్తయ్యాయి. సోమవారం గేట్లు బిగించారు. జగ్గన్నపేట సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి కృష్ణ, రైతులు ఆదీశ్వరరావు, నర్మాల రాజు, మళ్ల రమణ, భాస్కరరావు, పరదేశిరావు, పారునాయుడు, త్రినాథ్, నీటి సంఘ అధ్యక్షుడు పెంటకోట వెంకటప్పారావు, అంబుజా సిమెంట్ ఫౌండర్ బ్రిజేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరిలో కేళీల బెడద..



కేళీలతో ఉన్న వరి చేను

కోటవురట్ల : అసలే వర్షాభావ పరిస్థితులు. మరోపక్క వరిలో కేళీలు రైతులను కలవరపెడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో సుమారు 1800 హెక్టార్లలో వరి సాగు జరిగింది. ఆరంభంలో పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో గతంలో కంటే అధిక స్థాయిలో వరి సాగు చేశారు. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో వరుణుడు ముఖం చాటేశాడు. నీరు లేక మెరక ప్రాంతాలైన కొడవటిపూడి, జగ్గంపేట, కె.వెంకటాపురం, చినబొడ్డేపల్లి, ఆక్సాహేబుపేట. పి.కె.పల్లి, బోడపాలెం, కొత్తూరు ప్రాంతాలలో చాలా వరకు వరి చేలు ఎండిపోతున్నాయి. యండపల్లి, జల్లూరు, అన్నవరం, తంగేడు, రాజుపేట, గొట్టివాడ, కోటవురట్ల, రామచంద్రపురం ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్ల సాయంతో వరిచేలను బతికించుకుంటున్నారు. అయితే ఈ ప్రాంతాలలో ఏపుగా పంట పెరగడంతో పాటు కేళీలు అదే స్థాయిలో మొలుచుకొచ్చాయి. కేళీల కారణంగా పంటలో దిగుబడి బాగా పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9న తొలిదశ బస్సు యాత్ర ముగింపు సభ



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: సామాజిక సాధికార బస్సు యాత్ర తొలిదశ ముగింపు కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ నెల 9న నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించిన బస్సు యాత్ర గత నెల 26న ఇచ్ఛాపురంలో ప్రారంభమై ఈ నెల 9న స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానానికి చేరుకుంటుందన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలకు అమలు చేసిన పలు సంక్షేమ పథకాల లబ్ధిని సభలో వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను 98 శాతం అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత తమ అందరిపైనా ఉందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు.

సమష్టి కృషితో గ్రామాభివృద్ధి



ఉత్సవ కమిటీ చైర్మన్ కృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు కోరారు. మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమితులైన వేగి కృష్ణ అలాగే ఇంతవరకు ఉప సర్పంచ్‌గా సేవలందించిన పెంటకోట సత్యనారాయణలను ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఉత్సవాలను విజయవంతం చేయడంతో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. విశాఖ డెయిరీ సివిల్ ఇంజినీర్ వెలగా సురేష్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వచ్ఛత కోసం దోహదపడండి..



శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేసి బ్లీచింగ్ చల్లారు. జెడ్పీ హైస్కూల్, స్మశాన వాటిక పరిసరాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ మన గ్రామాన్ని మనమే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛ గ్రామం అందరి బాధ్యత అన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ఇంటిని, వీధులను శుభ్రంగా ఉంచాలన్నారు.


వాడ్రాపల్లిలో జంగిల్ క్లియరెన్స్

మునగపాక : వాడ్రాపల్లి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఇరువైపులా పేరుకుపోతున్న తుప్పల తొలగింపు పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్పుతున్నట్లు విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఈఈ కె.రాజశేఖర్, డీ-1 సెక్షన్ ఏఈ శ్రీనివాసరావులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణ పరిధి మళ్లవీధి, వేల్పులవీధి, శేఖవీధి, నర్సింగరావుపేట, ఉడ్‌పేట తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్‌ను సరఫరా ఉండదన్నారు.

'అనకాపల్లి వరకు సిటీ బస్ పాసులు అనుమతించాలి'



డీపీఎంవో పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: ఆర్టీసీలో నడుపుతున్న అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో హాల్ట్ ఏర్పాటు చేయడంతో పాటు, సిటీ బస్ పాస్‌లను విశాఖ పట్నం నుంచి అనకాపల్లి వరకు వర్తింపజేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆర్టీసీ డీపీఎంవో పద్మావతికి సోమ వారం వినతి పత్రం అందించారు. కాంప్లెక్స్‌లో కనీస వసతులు తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదన్నారు. కాంప్లెక్సు ఆవరణలో ప్రయాణికులు వేచి ఉండే ఫ్లాట్‌ఫారం శ్లాబ్ పెచ్చులూడుతూ ప్రయాణికులకు అపాయంగా మారుతోందన్నారు. ఫ్లాట్‌ఫారం వద్ద ఏర్పాటు చేసిన టీవీలు పనిచేయకపోవడంతో, ఏ బస్సు ఎప్పుడు వస్తుందో ప్రయాణికులకు తెలియట్లేదన్నారు. వీటన్నింటినీ వినతి పత్రంలో పేర్కొని, త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

రానున్నదీ మన ప్రభుత్వమే

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ సన్నద్ధత సమావేశం



ఎమ్మెల్యే కన్నబాబురాజు క్యాంపు కార్యాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి బ్రోచర్ విడుదల చేస్తున్న నాయకులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్) : 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేయడంలో గ్రామ, మండల స్థాయిలో నాయకులు, కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే కన్నబాబురాజు క్యాంపు కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం సన్నద్ధతా సమావేశం జరిగింది. దీనికి హాజరైన పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులంతా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వంద శాతం విజయవంతం చేయాలని కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, ఎంపీపీ బోదెపు గోవిందు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో జెండా ఎగురవేయాలన్నారు. 2014-2019 మధ్య చంద్రబాబు ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీలు 2019 నుంచి ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చిన హామీల వివరాలతో ఇంటింటికీ సందర్శించాలన్నారు. ఓటర్ల అభిప్రాయ సేకరణ చేసి చంద్రబాబునాయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిల్లో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో వెల్లడించాలన్నారు. గడప గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీకి మద్దతు కోరాలన్నారు. నాలుగున్నరేళ్లలో వేల సంఖ్యలో ఇళ్లు, అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసిన విషయాన్ని ఓటర్లకు తెలియజేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో వందశాతం వైద్యం అందిస్తున్నట్టు ప్రజలకు తెలియజేయాలన్నారు. 2024లో వచ్చేది మన ప్రభుత్వమేనని పలువురు నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు మరో ఐదు నెలలు మాత్రమే గడువు ఉందని ఈ నెల 9 నుంచి చేపట్టబోయే కార్యక్రమానికి అందరూ సమాయత్తమవ్వాలని పలువురు నాయకులు కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, సేనాపతి రాము, మళ్ల కొండబాబు, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, జె. అచ్యుతరామరాజు, వైస్ ఎంపీపీ యల్లపు గణేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హెటెరో పైపులైను పనులు ప్రారంభం



రాజయ్యపేట సమీపంలో పైపులైను పనులు



పనులు జరిగే చోట పోలీసుల బందోబస్తు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో ఉన్న హెటెరో రసాయన పరిశ్రమ పైపులైను పనులు ప్రారంభించింది. కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ జలాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు పైపులైను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే ఈ పైపులైను పనులు వెంటనే నిలిపివేయాలని అనుమతులు ఇవ్వరాదంటూ కొంతమంది వ్యక్తులు, వామపక్షనేతలు ఆందోళన చేపట్టారు. దాదాపు 600 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. అయితే కేంద్ర పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి శాఖ పైపులైను ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేయడంతో సోమవారం యాజమాన్యం భారీ బందోబస్తు నడుమ పైపులైను పనులు ప్రారంభించింది. అదే విధంగా రాజయ్యపేట గ్రామస్తులతో కూడా యాజమాన్యం చర్చలు జరిపింది. గ్రామాభివృద్ధి కోసం వారు చేసిన డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించడంతో పైపులైను పనులు సాఫీగా ప్రారంభమయ్యాయి. డీఎస్పీ మహేష్, సీఐలు అప్పన్న, గఫూర్, అప్పలరాజు, ఎస్ఐలు విభీషణరావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జేపీ అగ్రహారంలో కుళాయి పనులు



తాగునీటి కుళాయిలకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ చినమ్మలు, వైస్ ఎంపీపీ దేవి

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులకు పరిష్కారం దొరుకుతుందని నాగులాపల్లి సర్పంచ్ జామి చినమ్మలు అన్నారు. మండలంలోని నాగులాపల్లి జేపీ అగ్రహారంలో రూ.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఇంటింటికీ కుళాయిలకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం ద్వారా తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిందాడ దేవి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేడ బుజ్జి, కాండ్రేగుల ప్రకాష్, బాపునాయుడు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సివిల్ ఇంజినీర్ వినయ్ పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీలకు వంద రోజుల పనులు కల్పించాలి



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున

మునగపాక : ఎస్సీ, ఎస్టీ భూమిలేని కుటుంబాలకు వంద రోజుల పనులు కల్పించాలని స్పెషల్ డిప్యూటీ కమిషనర్ డి.మల్లికార్జున కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకంపై మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వం పథకంలో పలు మార్పులు చేపడుతుందన్నారు. చెరువులు, కాలువలు పూడికతీత పనులను తాత్కాలికంగా నిలుపుదల చేస్తుందన్నారు. మొక్కల పెంపకం, రైతుల భూముల సరిహద్దు గట్లు ఏర్పాటు, కందకాల తవ్వకం వంటి పనులు చేపట్టాలన్నారు. యలమంచిలి క్లస్టర్ ఏపీడీ బి.శ్రీనివాస్‌కుమార్, మాడుగుల క్లస్టర్ ఏపీడీ శ్రీనివాస్, మునగపాక మండల ఉపాధి హామీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి బీమా అందజేత



మృతి చెందిన వలంటీర్ కుటుంబానికి రూ.10 వేలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

యలమంచిలి (అనకాపల్లి రూరల్) : పట్టణంలో 9వ వార్డు వలంటీర్ వీసం స్వాతి ఇటీవల మృతి చెందారు. విధులు నిర్వహిస్తుండగా మృతి చెందిన ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం వలంటీర్ నామినీ వీసం ప్రవీణ్‌కు మట్టి ఖర్చులకు రూ.10వేలు నగదు అందజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు బీమానిచ్చేందుకు ప్రతి ఒక్కరికీ లక్ష రూపాయల బీమా సౌకర్యం కల్పించింది. మృతి చెందిన వలంటీర్ స్వాతి కుటుంబీకులకు వైఎస్సార్‌సీపీ నేతలు ధైర్యం చెప్పారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సేనాపతి రాము, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వర్రావు, కొటారు కొండబాబు, ధర్మవరం సచివాలయం సంక్షేమ కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.